


## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 200 అర్జీలు



చిత్తూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 200 ఫిర్యాదులు అందాయి. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీలు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అదికారులను ఆదేశించారు. మొత్తం 200 అర్జీలు జిల్లా అధికారులకు అందగా ఇందులో అత్యధికంగా 166 సమస్యలు రెవెన్యూ శాఖకు సంబంధించినవి అందాయి.

### నేడు షార్‌కు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి

# పవన్‌కల్యాణ్ రాక

**ఒక్కరోజు ఆలస్యంగా రాకెట్ ప్రయోగం**

**పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు**

**అంతరిక్ష దినోత్సవ వేదికపై ప్రసంగించనున్న పవన్**

**షార్‌లో వివిధ పరిశోధన కేంద్రాలను సందర్శించనున్న ఉప ముఖ్యమంత్రి**



శ్రీహరికోట (తడ), ఆగస్టు 12 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ పర్యటించనున్నారు. నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా ఇస్రో, షార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ఉప ముఖ్యమంత్రి రాక సందర్భంగా శ్రీహరికోటలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటు పోలీసు బలగాలు, అటు సిఐఎస్ఎఫ్ దళాలు షార్‌లోని ప్రధాన గేటుతో పాటు ఇతర ముఖ్య ప్రదేశాలలో జల్లెడపడుతున్నారు. ఆయన హెలికాప్టర్ ద్వారా షార్ కేంద్రానికి వచ్చి మళ్లీ హెలికాప్టర్‌లోనే వెళ్లిపోతున్నప్పటికీ సూళ్లూరుపేట-శ్రీహరికోట రోడ్డులోను, పులికాట్ తీరప్రాంతంలోని రోడ్లపైన కూడా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పవన్ కల్యాణ్ మంగళవారం ఉదయం రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి శ్రీహరికోటకు హెలికాప్టర్‌లో వచ్చి ఉదయం 9.25 గంటలకు షార్ హెలిప్యాడ్‌లో దిగుతారు. ఇక్కడ అంతరిక్ష శాస్త్రవేత్తలతో పాటు ఎంపిక చేసిన కొందరు ముఖ్యులు మాత్రమే ఆయనకు స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత షార్‌లోని నక్షత్ర అతిథిగృహానికి వచ్చి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం ఎంఆర్ కురుప్పు ఆడిటోరియంకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. ఉదయం 10 గంటల నుంచి అక్కడ జరుగుతున్న అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. పవన్ కల్యాణ్ ప్రసంగం అనంతరం తిరిగి 12 గంటలకు ఎంఆర్ కురుప్పు ఆడిటోరియం నుంచి రాకెట్ ప్రయోగ వేదికలు, మిషన్ కంట్రోల్ సెంటర్లను సందర్శిస్తారు. విశ్రాంతి అనంతరం షార్‌లోని హెడిప్యాడ్‌కు చేరుకొని అక్కడి నుంచి రేణిగుంటకు బయలుదేరుతారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన తర్వాత శ్రీహరికోటలో అటు బందోబస్తు ఏర్పాట్లు, ఇటు ఈ నెల 15న జరగనున్న ఎస్ఎస్ఎల్‌వి డి3 రాకెట్ ప్రయోగ ఏర్పాట్లలో షార్ అధికారులు నిమగ్నమయ్యారు. మంగళవారం నాటి కార్యక్రమానికి ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయన 14న సాయంత్రం ఇక్కడికి వచ్చి 15న ఉదయం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో, రాకెట్ ప్రయోగ వీక్షణలో పాల్గొంటారని చెబుతున్నారు.



### భూ సమస్యల పరిష్కారానికి

# రెవెన్యూ సదస్సులు

**ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30 వరకు గ్రామాలకు రెవెన్యూ అధికారులు - గ్రామాల వారీగా సదస్సుల నిర్వహణకు పక్కా ప్రణాళిక - సదస్సులకు రెవెన్యూ రికార్డులు సిద్ధం చేసుకొండి - తహసిల్దార్లకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**

చిత్తూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో భూసమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధం అయ్యింది. ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30వ తేద వరకు 45 రోజుల పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో తిష్ట వేసి రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టనున్నారు. చిత్తూరు జిల్లాలో రెవెన్యూ సదస్సులు పక్కాగా నిర్వహించి ప్రజల భూసమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తహసిల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అంటే 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఏ గ్రామంలో ఎప్పుడు సదస్సులు నిర్వహించాలనే అంశంపై తగు ప్రణాళికను పక్కాగా రూపొందించి కలెక్టరేట్‌కు పంపాలని తహసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్, వన్‌బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా వుంటాయని, ఇలాంటి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులకు అవసరమైన రికార్డులను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తహసిల్దార్లను ఆదేశించారు. అలాగే 22ఎ, ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి అన్ని విషయాలను పరిశీలించి అందుకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి తహసిల్దారు ప్రాథమికంగా వారి పరిధిలో ఏ రెవెన్యూ గ్రామంలో ఎక్కువ సమస్యలు వచ్చే అంశంపై ఒక నిర్ధారణకు రావడానికి గత ఆరు నెలలుగా ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించాలన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణలో అలాంటి గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా సదస్సులు నిర్వహిస్తే ఒత్తిడి తగ్గుతుందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మండల సర్వేయర్, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. అలాగే ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ నియామకంతో పాటు ఆర్డీఓలు వారి డివిజన్ల పరిధిలోని మండలాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని, సదస్సుల నిర్వహణకు ముందుగానే ఆర్ఓలు, విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బందితో తహసిల్దార్లు మందస్తు సమావేశం నిర్వహించి సదస్సుల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సదస్సుల్లో తహసిల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు అన్ని రకాల రికార్డులను తీసుకువచ్చి పరిశీలించడంతో పాటు ఏ సమస్యకైనా నిర్ణీత సమయంలోపు నోటీసులు జారీ చేసి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, ఇతర శాఖల అధికారులు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

### అనుమానాస్పదంగా

## కారు దగ్ధం



రామచంద్రాపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి సమీపంలో డంపింగ్ యార్డ్ వద్ద అనుమానాస్పదంగా కారు దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న మహాభారత ఉత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించడానికి తిరుపతి - అనుపల్లి ప్రధాన రహదారిలో వున్న చెత్త నుంచి సంపాదన తయారు చేసే కేంద్రం వద్ద కారును ఆపి సమీపంలోని భారతమిట్ట వద్దకు వెళ్లారు. అక్కడ పనులను పరిశీలించి తిరిగి వచ్చేటప్పటికి కారు పెద్ద మంటలలో చిక్కుకుని ఉంది. వెంటనే తిరుపతి అగ్నిమాపక అధికారులకు ఫోన్లో సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయమై రామచంద్రాపురం పోలీసుకు కూడా ఫిర్యాదు చేశారు.

## కాణిపాకం ఆలయ ఈఓ బదిలీ



కాణిపాకం, ఆగస్టు 12 ప్రభాతవార్త: కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.వెంకటేశును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. రెవెన్యూ శాఖలో నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూసేకరణ)గా పని చేస్తున్న ఎ.వెంకటేశును జిల్లాకు చెందిన అప్పటి మంత్రి అండదండలతో డెప్యుటేషన్‌పై దేవాదాయశాఖకు తీసుకువచ్చి కాణిపాకం ఆలయ ఈఓగా నియమిస్తూ గత ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈమేరకు 2020 జూన్ 5 నుండి 2022 ఏప్రిల్ 16 వరకు ఈయన కాణిపాకం ఆలయ ఈఓగా కొనసాగారు. అయితే దేవాదాయశాఖ అధికారుల అభ్యంతరాలతో వెంకటేశును తిరిగి మాతృశాఖ రెవెన్యూకు బదిలీ చేసింది. అయితే అప్పటి మంత్రి, ప్రభుత్వ అండదండలతో ఆరునెలల్లోనే కాణిపాకం ఆలయ ఈఓగా ఏడాది కాలానికి డెప్యుటేషన్‌పై రెండవసారి పోస్టింగ్ తెచ్చుకుని 2022 నవంబర్ 18 నుండి ఈఓగా కొనసాగుతున్నారు. ఈయన పదవీకాలం గత ఏడాది నవంబర్ 18న ముగియగా ఎటువంటి పొడిగింపు ఉత్వర్వులు లేకుండా సుమారు 15 రోజుల పాటు కొనసాగి అనంతరం ప్రభుత్వ పెద్దల అండదండలతో మరో ఏడాది కాలానికి ఈఓగా పొడిగించుకుని ఈఓగా కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో గత ప్రభుత్వంలో వైకాపాతో అంటకాగుతూ అత్యంత వివాదాస్పద ఈఓగా పేరు తెచ్చుకున్న ఈయనను ప్రస్తుత ప్రభుత్వం ఆలయ ప్రక్షాళనలో భాగంగా బదిలీ చేసింది. ఈమేరకు వెంకటేశు డిప్యుటేషన్‌ను రద్దు చేసి మాతృశాఖ రెవెన్యూ జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఇదిలా వుండగా వెంకటేశు స్థానంలో ఈఓగా ఇంతవరకు ఎవరిని నియమించలేదు. ఆలయ ఇన్‌చార్జి ఈఓగా దేవస్థానం డీసీ, లేదా ఈఈకి ఇన్‌చార్జి బాద్యతలు అప్పగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అలాగే రెగ్యులర్ ఈఓగా కర్నూలు డిప్యూటీ కమీషనర్ గురుప్రసాద్ లేదా ఆర్జెసీ సాగర్‌బాబును నియమించే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

**ఇవో బదిలీతో పెద్ద ఎత్తున సంబరాలు**

శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఇఓగా పనిచేస్తున్న ఎ.వెంకటేశులను ప్రభుత్వం బదిలీ చేయడంతో కాణిపాకంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. ఇఓ వెంకటేశులను బదిలీచేస్తూ రెవిన్యూశాఖ జిఏడిలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో వివాదాస్పద ఇవోగా పేరు తెచ్చుకున్న ఈయన బదిలీ కావడంతో ఆలయ ఉభయదారులు, టిడిపి, జనసేన, వైకాపా తదితర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు. ఎన్నడూ లేని విధంగా ఒక అధికారి బదిలీ కావడంతో సంబరాలు నిర్వహించడం గమనార్హం.

## నల్లగంగమ్మ జాతర నిమజ్జనంలో ఘర్షణ

### ఆసుపత్రి పాలైన ఇద్దరు యువకులు



యువకుని వీపుపై దిగిన కత్తి దృశ్యం



తీవ్రంగా గాయపడిన యువకుడు

శ్రీకాళహస్తి, ఆగస్టు 12 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని బహాదూరుపేటలో వెలసిన నల్లగంగమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర సందర్భంగా ఆదివారం రాత్రి నిమజ్జనం సందర్భంగా యువకుల ఆటపాటలు శృతిమించి ఘర్షణగా మారింది. అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన పరస్పర దాడుల్లో ఇద్దరు యువకులు గాయపడి తిరుపతి రుయాఆసుపత్రి పాలయ్యారు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బహాదూరుపేటలోని నల్లగంగమ్మ ఆలయంలో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఒకే రాజకీయ పార్టీకి చెందిన యువకులు ఆడుతూ పాడుతూ నృత్యాలు చేస్తూ నిమజ్జనం సందర్భంగా బయలు దేరారు. బ్యాండు మేళాలు తప్పెట్ల మోతతో రెండు వర్గాలకు సంబంధించిన యువకులు నృత్యాలు చేస్తూ ఘర్షణ పడ్డారు. ఈ దాడిలో నాగేంద్రబాబు వర్గీయులపై శివారెడ్డి వర్గీయులు మాటా మాట పెంచుకున్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో నాగేంద్రబాబు గాయ పడ్డారు. దీనిని చూసిన నాగేంద్రబాబు వర్గీయులు రెచ్చిపోయారు. నాగేంద్రబాబుకు రక్తగాయాలు కావటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దాడి చేసిన శివారెడ్డితో పాటు ఆయన సహచరుడు సాయి పారిపోతుండగా వెంబడించారు. ఈ దాడిలో సాయి తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు రంగంలో దిగారు. గాయపడ్డ ఇద్దరు యువకులను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స జరిపి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించారు. కేసును టూటౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

### కలుషిత ఆహారం తిని

## విద్యార్థులకు అస్వస్థత

**ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది : వైద్య ఆరోగ్యశాఖ అధికారి**



రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త: రేణిగుంట బీసీ హాస్టల్‌లోని 21 మంది విద్యార్థులు ఆదివారం రాత్రి కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం వాంతులు విరేచనాలతో బాధ పడ్డారు. వీరిలో ఏడు మందికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందించగా మరో 14 మందిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించినట్లు రేణిగుంట మడల ప్రాథమిక వైద్యాధికారి ఛత్రప్రకాష్ తెలిపారు. చికిత్స పొందుతున్న వారి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బీసీ హాస్టల్ పక్కన గృహ ప్రవేశం కార్యక్రమంలో మిగిలిన ఆహారాన్ని హాస్టల్ విద్యార్థులు తిన్నందువల్ల ఫుడ్ పాయిజన్ అయినట్లు ఛత్రప్రకాష్ తెలిపారు. 35 మంది విద్యార్థులు ఆహారాన్ని భుజించగా 21 మంది అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులకు పూర్తిగా స్వస్థత చేకూరే వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హాస్టల్‌లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని డా. తెలిపారు. హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థులతో కలసి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బాల, సీపీఎం నాయకులు హరినాథ్, సెల్వరాజ్, వేమన విజ్ఞాన కేంద్రం నాయకులు ఓ వెంకటరమణ నిరసన వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 164 ఆర్జీలు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 12, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయం లోపు పరిష్కారం చూపాలని, అలసత్వం వహించరాదని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రామ్మోహన్, నరసింహులు, కోదండ రామిరెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 164 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా, అర్ధవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశించారు.

## రాష్ట్రం అగ్రగామిగా అభివృద్ధి చెందాలి

### -శ్రీవారి సేవలో మంత్రులు





తిరుమల, ఆగస్ట్ 12ప్రభాతవార్తప్రతినిధి: అన్ని విధాలా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా అగ్రగామిగా అభివృద్ధిచెందే శక్తిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రసాదించాలని మంత్రులు వేడుకున్నారు. సోమవారం ఉదయం రాష్ట్రరెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ,విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ శ్రీవారిని దర్శించుకున్నారు.












## విద్యను కార్పొరేటీకరిస్తే అంధకారమే

### - రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ



చిత్తూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:
విద్య, వైద్య రంగాలు కార్పొరేటీకరణ కావిస్తే భవిష్యత్తులో దేశం అంధకారంలోకి వెళ్ళిపోతుందని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పేర్కొన్నారు. చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయ ఆవరణలో సోమవారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని యుటిఎఫ్ నాయకులు జెండాను ఎగురవేశారు. రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్య, వైద్యను కార్పొరేటీకరణకు అనుగుణంగా ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని దీనికి సత్వరం ఫుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహెనా బేగం, రెడ్డప్పనాయుడు, ఎస్పీ భాషా, పార్థసారధి, గణేష్‌కుమార్, సునందనరెడ్డి, విజయనాయుడు, జయరామన్, బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక వినతులు పరిష్కారం



చిత్తూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంల ప్రజల నుండి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయికి వెళ్ళి వేగంగా పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై 10 అర్జీలు అందగా వాటిని పరిష్కరించడానికి సత్వరం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

యాదమరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:
విద్యార్థులకు దృష్టిలోపం లేకుండా చేయడానికి యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం చేపట్టనుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ గిరిరాజా, అప్తాలమిక్ అసిస్టెంట్ మధు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

వెదురుకుప్పం,ఆగస్టు 8 ప్రభాతవార్త :
తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబును సోమవారం తెలుగు దేశం పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దుశాలువతో సన్మానించారు. మండల పరిస్థితులను వివరించి, రెవెన్యూ సమస్యల పరిష్కరంకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు కామసాని లోకనాథ రెడ్డి, టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి మోహన్ మురళి, టిఎన్‌టీయూసీ నియోజకవర్గం ఉపాధ్యక్షులు పోటూగారి గంగయ్య, నాయకులు మునిచంద్రా రెడ్డి, వెంకటరమణ రెడ్డి, బాబురెడ్డి, చంద్రబాబు రెడ్డి,రమేష్, మాధవ నాయుడు, వరప్రసాద్, విక్రమ్ రెడ్డి, లోకనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూలడానికి సిద్ధంగా ఉన్న పాత బిల్డింగ్



పాకాల, ఆగస్టు 12, ప్రభాతవార్త
పాకాల పట్టణంలో ధర్మరాజుల గుడి వీధి ట్రెజరీకి సమీపంలో శిధిలావస్థలో ఉన్న పాత భవంతి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. సోమవారం సాయంత్రం కురిసన వర్షానికి ముందు భాగంలో వున్న బాల్కనీ కూలి రోడ్డుపైన పడిపోవడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, పాదచారులు తృతిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పంచాయితీ వారు బిల్డింగ్ యజమానికి తక్షణం తెలియపరచి పరిసర భవంతులకు, వచ్చి పోయే ప్రజలకి ఎటువంటి ప్రాణహాని జరగకముందే స్పందించవల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.
ఫోటో రైటప్

## ఎయిడ్స్ రహిత సమాజ ఆవిష్కరణకు కృషి : కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:
హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన, వివరాలను పెంపొందించెందుకు ప్రవేశపెట్టిన టోల్‌ఫ్రీ నెం.1097ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశమందిరంలో సోమవారం నేకో(ఎన్ఏసిఒ) మార్గదర్శకాలతో ఏపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నేతృత్వంలో మీకు తెలుసా పేరిట ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ రెండు నెలల పాటు జిల్లాలో నిర్వహించడానికి రూపొందించిన బ్యానర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆగస్టు 12 నుండి రెండు నెలల పాటు ఈ కార్యక్రమంను నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీకి మొదటి మూడు నెలల్లోనే హెచ్ఐవి పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ ఆవిష్కరణకు ప్రతి ఒక్కరు నడుంబిగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పిడి రాజశేఖర్, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, అదనపు డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా శ్రీమన్నారుస్వామి సమేత పచ్చయమ్మన్ కళ్యాణోత్సవం



చిత్తూరురూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త:
చిత్తూరు నగరం, దొడ్డిపల్లి నందు వెలసిన శ్రీమన్నారు స్వామి సమేత పచ్చయమ్మన్ ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవాన్ని హైదరాబాదు గచ్చిబౌలిలోని శ్రీ భద్రకాళి ఆస్థాన మఠం పీఠాదిపతి సిందూ మాతాజీచే ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుకుమరన్ వేడుకగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేకపూజ, అభిషేకం, 10గంటలకు గోపూజా కార్యక్రమం, అనంతరం మధ్యాహ్నం మన్నారుస్వామి సమేత పచ్చయమ్మన్ కళ్యాణోత్సవంను అతి వైభవంగా నిర్వహించారు. కాగా పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు స్వామి, అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేసారు.

## మాదకద్రవ్య రహిత పంచాయతీగా తీర్చిదిద్దుతాం



పెద్దపంజాణి ఆగస్టు12 ప్రభాతవార్త :
మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీని మాదకద్రవ్యరహిత పంచాయతీగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ రమేష్‌బాబు పేర్కొన్నారు.సోమవారం జిల్లాకలెక్టర్ ఆదేశాలమేరకు సచివాలయంలో ఈ రాష్ట్రాన్ని,జిల్లాను, మండలాన్ని,పంచాయతీని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు దృఢసంకల్పం తీసుకుంటామని,నా దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి నా శక్తిమేరకు కృషి చేస్తానని సచివాలయ అదికారులు, గ్రామస్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయ వెల్ఫేర్ అధికారి నజీర్‌భాషా,ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ,మహిళా పోలీస్ తేజస్విని,శివశంకర్ రెడ్డి,మంజునాథ్,రఘు,దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవం

పలమనేరు,ఆగస్టు 12,ప్రభాతవార్త:
పలమనేరు నియోజకవర్గంలో ఘనంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక అటవీ శాఖ కార్యాలయం నుండి స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో రక్షిద్దాం...రక్షిద్దాం...ఏనుగులను రక్షిద్దాం అన్న నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శివన్న మాట్లాడుతూ పలమనేరు పరిసరప్రాంతం కౌండిన్య నది సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 124 ఏనుగులు ఉన్నాయని వాటి రక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.కార్యక్రమంలో అటవీశాఖ,పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన తెదేపా నేతలు

కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త
కుప్పంకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు సోమవారం కుప్పం కోర్టుకు హాజరయ్యారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు విచ్చేయగా ఆ సమయంలో వైకాపా శ్రేణులు చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు యత్నించింది. ఈ నేపథ్యంలో పలువురు తెదేపా నేతలపై అప్పట్లో సెక్షన్ 307కింద కేసు నమోదు కాగా సోమవారం ఈ కేసు విచారణకు సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మా సంఘమిత్రలను తొలగించకండి : మహిళ ఆందోళన



చౌడేపల్లి, ఆగస్టు 12 ప్రభాతవార్త
" యేళ్ళ తరబడి సేవలందించి సంఘాల బలోపేతానికి అహర్నిశలూ శ్రమించిన మా సంఘమిత్రలను తొలగించే చర్యలు విరమించుకోండి "అంటూ మహిళలు స్థానిక ఐకెపి భవనం వద్ద ఆందోళన చేపట్టారు. వారికి సిఐటియు మండలాధ్యక్షుడు డాక్టర్ చంద్ర మద్దత్తు పలికారు. వారు మాట్లాడుతూ ఎ.కొత్తకోట, అంకుతోటపల్లి, ఎస్.అగ్రహారం, మంచినీళ్ళపల్లి, కుంచినపల్లిలకు 2విఓలున్నాయనీ, ఆయా విఓల్లో దాదాపు 60మహిళా సంఘాలున్నాయన్నారు. తామందరికీ సుభాషిణీ, నాగరత్నలు స్థానికంగా వుంటూ గత 20యేళ్లుగా సంఘమిత్రలుగా పనిచేస్తున్నారనీ, వారిద్దరినీ కొందరు తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలాంటి చర్యలకు స్వస్తి పలకాలన్నారు. ఈమేరకు ఐకెపి ఎపిఎం సర్వోత్తమరెడ్డికి మహిళలు వినతి పత్రాన్నందించారు. ఎ.కొత్తకోట విఓ లీడర్లు కల్పన, ఉషా, చెల్లమ్మ, ఆయా గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి కొల్లురవీంద్రను కలసిన దేశం మైనార్టీ నేతలు



కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త
రాష్ట్ర భూగర్భ,గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కుప్పం నియోజకవర్గ తెదేపా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, సీనియర్ నేత ఫైరోజ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలో మంత్రి రవీంద్రను కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రానైట్ దోపిడీపై మంత్రికి వివరించినట్లు తెలిపారు. గ్రానైట్ కార్మికులను ఆదుకునేలా కృషి చేయాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## తమ గుడిసెలు కూల్చేశారని పి.డి.కి యానాదుల ఫిర్యాదు

కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త
మండలంలోని మిట్టపల్లి పంచాయతీ వేపూరు సమీపంలో తాము గత కొన్నేళ్లుగా ప్రభుత్వ డికెటి స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉండగా ఓ వ్యక్తి ఆ స్థలం తమదని తమ గుడిసెలు తొలగించారని పలువురు యానాది కుటుంబాలు సోమవారం కడ పి.డి. వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు పాతిక కుటుంబాలు గుడిసెల్లోనే ఉంటున్నామని అయితే తమ గుడిసెల పక్కన పొలం కొనుగోలు చేసిన ధనశేఖర్ అనే వ్యక్తి ఈ స్థలం కూడా తనదేనని తమ గుడిసెలను తొలగించాడని దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోయారు. దీనిపై స్పందించిన పి.డి. తానే నేరుగా సంఘటనా స్థలికి వచ్చి పరిశీలించి తగు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు.

## హరిత కుప్పంగా మార్చేందుకు ప్రణాళికలు - మున్సిపల్ కమీషనర్

కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త
కుప్పం పురపాలక పరిధిలోని కుప్పం పట్టణాన్ని హరిత కుప్పంగా మార్చేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం 600 మొక్కలను తెప్పించి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రోడ్ డివైడర్ల మధ్యలో, ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలను కమీషనర్ ఏర్పాటుచేయించారు. కమీషనర్ చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో ఉన్న రాజుకాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను జెసిబి యంత్రాలతో తొలగిస్తున్నట్లు కమీషనర్ తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవం

సదుం,ఆగస్టు12ప్రబాతవార్త
మండల పరిదిలోని బూరగమంద పంచాయతీ చీకలచేనుపల్లెలో సోమవారం పుంగనూరు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రామస్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బహుమతులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ భూమిపై జీవించి ఉన్న జంతువులలోఅతి పెద్ద జంతువు ఏనుగు అన్నారు. అవి చాలా తెలివైనవని వాటి వలన అడవులు రక్షింపబడుతాయన్నారు. దానివల్ల వర్షాలు విస్తారంగా కురుస్తాయని చెప్పారు. అడవికి నుప్పు పెట్టడం వన్యప్రాణులను వేటాడటం నేరం అన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## స్వాతంత్ర్యం కోసం ఉద్యమం నడిపిన ఏకైక విద్యార్థి సంఘం

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. శశికుమార్



గూడూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త
గూడూరు నియోజకవర్గం వ్యాప్తంగా అనేక విద్య సంస్థల్లో ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని ఎస్‌కెఆర్ డిగ్రీ కాలేజ్ నందు ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. శశికుమార్ మాట్లాడుతూ ఉద్యమాలలో ఉద్భవించిన సమరశీల ఉద్యమాల సారధి, సూర్యుడు హస్తమించని బ్రిటీషు పాలకుల నుండి మన దేశాన్ని విముక్తి చేయడానికి బ్రిటీషు పాలకులను తరమికొట్టి స్వాతంత్రోద్యమంలో దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసి ఉద్యమాన్ని నిర్మించిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అని తెలిపారు. 85 శాతం రిజర్వేషన్ల ప్రకారం కన్వీనర్ కోటాలో సీట్లు ఇవ్వాలని మి గిలిన 15 శాతాన్ని క్రీడా రంగానికి, పోలీస్ అమరవీరుల విద్యార్థులకు ఎన్‌సిసి రంగానకి కేటా యించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు ప్రమోద్, ప్రణయ, సుమంత్, ముకేష్, మహిళా నాయకురాలు హారిక, రెడ్డెమ్మ, జ్యోత్స్న లీలావతి, నందిని, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలి : అరుణ

బాలాయపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త
గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అన్న గాంధీజీ ఆశయంతో ప్రతి ఒక్కరూ పని చేయాలని బాలాయపల్లి ఎంపిడిఓ పి. అరుణ కోరారు. స్త్రీ శక్తి భవనంలో జరిగిన సర్పంచులు, పంచాయితీ కార్యదర్శుల జరిగిన సర్పంచులు, పంచాయితీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల పురోభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై శిక్షణలో వివరాలు తెలిపారు. 15 ఆర్థిక సంఘ నిధులు ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపై చర్చించారు. ఈ శిక్షణ తరగతుల్లో సర్పంచులు వెందోటి సుప్రజా, వెంకటసుబ్బయ్య, గాయత్రి, అంజలి, శిక్షణ ట్రైనరర్లు లీలావతి, దయాకర్, మోహన రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించండి

వాకాడు, ఆగస్టు 12, ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ రాజ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందని అందులోని భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలోని అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర కమిషనర్, ప్రతినిధి రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో మండల పంచాయితీ సర్పంచులకు, కార్యదర్శిలకు ఎంపిడిఓ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయితీ గ్రామాలలో అభివృద్ధితో పాటు, తడి చెత్త పొడి చెత్త, విద్యుత్ దీపాలు, బకాయిలు గురించి ఆమె వివరించారు. ఈ సమావేశంలో గూడూరు డిఎల్‌పిఓ , ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, వెలుగు ఏపిడి వరప్రసాద రావు, పంచాయితీ అభివృద్ధి పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, సర్పంచులు అనిల్ కుమార్ రెడ్డి, బండి వెంకట రత్నమ్మ, రవి శేఖర్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, మహేంద్ర, శంకరమ్మ, పుల్లమ్మ, పోలమ్మ, లక్ష్మి, కిషోర్ కుమార్, నాగరాజు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 117 జీవోను రద్దు చేయాలి

### ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కె. రమేష్ బాబు

బాలాయపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త
117 జీవోను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేపడితే ప్రాథమిక పాఠశాలలకు మరణశాసనంగా మారుతుందని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మూడవ తరగతి నుండి 8వ తరగతి వరకు 50 మంది ఉన్నారని ఇద్దరు ఎస్జీటీలతో బోధించమనడం ఎంత వరకు న్యాం అని తిరుపతి జిల్లా ఎస్టియు జిల్లా అధ్యక్షులు కె. రమేష్ బాబు ప్రశ్నించారు. ప్రాథహిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 20 మంది ఉన్నారని ఇద్దరు ఉన్నటువంటి సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయులలో ఒకరిని సర్ ప్లస్‌గా చూపించి 6 మంది విద్యార్థులు 9 మంది విద్యార్థులు, 11 మంది విద్యార్థులు ఉన్నటువంటి కొన్ని ప్రాథమిక పాఠశాలలకు ఇద్దరి ఉపాధ్యాయులు కేటాయించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

## గ్రామ స్వరాజ్యమే పంచాయతీల లక్ష్యం కావాలి

### - విస్తరణ అధికారి మనోహర్ గౌడ్



చిట్టమూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త
గ్రామ పంచాయతీలు అభివృద్ధికి ఆదర్శంగా, అవసరమైన మౌలిక వసతులు కల్పనకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద అవసరమైన చర్యలు తీసుకోవాలని చిట్టమూరు మండల పరిషత్ విస్తరణ అధికారి మనోహర్ గౌడ్ తెలిపారు. సోమవారం చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ, అవగాహన తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆనంద్, శంకర్, ఎల్లయ్య, రాజేంద్ర మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటు దిశగా ఆయా పంచాయతీలు రూపుదిద్దుకోవాలని సూచించారు. పంచాయతీల్లో 15 ఫైనాన్స్ కింద నిధులు మంజూరు, 2024–25 యాక్షన్ ప్లాన్ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆర్థిక అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు

కోట, ఆగస్టు 12 ప్రభాతవార్త



గ్రామ పంచాయతీల అభివృద్ధికి వందరోజుల కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిదీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కార్యదర్శులు ప్రణాళిక రూపొందించాలని కోరారు. పంచాయతీల్లో తాగునీటి వనరులకు సంబంధించిన పథకాలు, చెరువులు, పైపులైన్లు, కుళాయిలు ఎక్కడెక్కడ ఏ స్థితిలో ఉన్నాయో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. నీటి నాణ్యత, పరిశుభ్రత, భూగర్భ జలాలు, నీటి వనరులు పరిశీలించి లబ్ధిదారుల పేరుతో యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి శ్రీనివాసులు, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

## సర్వర్ సమస్యలతో బ్యాంకుల్లో నిలిచిన సేవలు

కోట, ఆగస్టు 12 ప్రభాతవార్త
కోట మండలం విద్యానగర్‌లోని ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకుల్లో ఖాతాదారులు నగదు డ్రా చేసుకోవడానికి ఇబ్బందులకు గురయ్యారు. బ్యాంకుల్లో నగదు జమ చేసుకోవడానికి వెళ్లిన వారు నిరాశతో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరచూ బ్యాంకుల్లో సర్వర్ సమస్యల ఏర్పడుతుండటంతో ఖాతాదారులు అసహనానికి గురవుతున్నారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ కిరణ్‌కుమార్‌ను ఈ విషయంపై వివరణ కోరగా, బ్యాంకుకు బిఎస్ఎన్ఎల్ సర్వర్ సమస్య వల్ల ఇలా జరిగిందని తెలిపారు. మధ్యాహ్నం నుంచి సర్వర్ సమస్య ఏర్పడలేదని చెప్పుకొచ్చారు.

## పంచాయతీలకు ఆర్థిక స్వతంత్రం

కోట, ఆగస్టు 12 ప్రభాతవార్త
గ్రామాల్లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీల సర్పంచులు సిద్ధంగా ఉన్నారని వెంకన్నపాలెం సర్పంచ్ కె.మధుయాదవ్ చెప్పారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలకు నిధులు కేటాయించడంతో ముందుగానే పంచాయతీల్లో స్వాతంత్ర్యం వచ్చినట్లయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏనాడూ పంచాయతీలకు ఈ స్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. దీంతో సర్పంచులు సొంత నిధులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించి దేశభక్తిని చాటుకునే వారన్నారు.

## మా భూములు మాకు ఇప్పించండి

దొరవారిసత్ర ం ఆగస్టు 12 ప్రభాతవార్త
దొరవారిసత్రం మండలంలోని భూదూరు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు మా భూములు మాకు ఇప్పించండి అంటూ తహసిల్దార్‌కు సోమవారం విన్నతిపత్రం అందజేశారు. భూదూరు గ్రామానికి చెందిన రైతులు మాట్లడుతూ సర్వేనెంబరు 44నుండి59 నెంబరులో గల భూములను నకిలి రిజిస్టేషన్ చేసుకొని ఆక్రమించారని తెలిపారు.అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ భూమి విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

డక్కిలి, ఆగస్టు 12,ప్రభాతవార్తః
పంచాయతీల్లో గతంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో మూడు రోజులు పాటు జరగనున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీపీ మట్లాడుతూ పంచాయతీ పాలనలో సర్పంచ్‌లు, కార్యదర్శులు పరస్పర అవగాహనతో పనిచేసి పంచాయతీ పాలనలో తమదైన ముద్ర వేసుకోవలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లాబక్షుతదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక విషయంలో అధికారుల పొంతనలేని సమాధానాలు



గూడూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త
గూడూరు డివిజన్ పరిధిలో ఉచిత ఇసుక విషయంలో గ్రీవెన్స్ డేలో వినియోగదారులకు అర్జీలు చేతపట్టుకుని ఉచిత ఇసుక కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నా పొంతన లేని సమాధానాలు ఇస్తుండడంతో ప్రజలు ఇసుక కోసం నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి కొనసాగుతుంది. గూడూరు పట్టణంలోని పలు సమస్యలపై గ్రీవెన్స్ డే రోజు సిపిఎం పార్టీ నాయకులు గూడూరు ఎమ్మార్వో చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లడం కోసం వెళ్లడం జరిగింది. ఇక్కడ ఉచిత ఇసుక విషయమై వినియోగదారుడు స్థలం నందు నూతన గృహం నిర్మించుకునేందుకు ఉచిత ఇసుక విషయమై ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో సిపిఎం నాయకుల సహాయంతో ఎమ్మార్వో చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఎమ్మార్వో వెంటనే స్పందిస్తూ ఇసుక ఎక్కడి నుంచైనా ఉచితంగా తీసుకొని రావచ్చునని, ఎవరైనా ఆపితే నా నెంబర్‌కు ఫోన్ చేయగలరని సిపిఎం నాయకుల సమక్షంలో భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్. సురేష్, భవన నిర్మాణ వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, బండి కృష్ణయ్య, అడపాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే పాశిం



గూడూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త
గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజ విజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అధికారులు, ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు కలసి టీచర్స్ డే రోజున అతిధిగా తమ పాఠశాలకు రావాలని కోరారు.

## లారీ కింద పడి చిన్నారి మృతి

చిల్లకూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త
చిల్లకూరు మండల పరిధిలోని లింగవరం గ్రామ సమీపంలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన సరోజ్ పూజ శెట్టి దంపతులకు 14 నెలల బాలుడు ఉన్నాడు. అయితే సోమవారం చిన్నారి తండ్రి వాహనం కోసం ఎదురుచూస్తుండగా విజయవాడ నుండి అటల్ తీసుకొని వస్తున్నా ఐసర్ వాహనం అక్కడికి వచ్చేసరికి సరోజిని పరిశ్రమలోకి ఎలా వెళ్లాలని అడ్రస్ అడిగాడు లారీ డ్రైవర్. నేను కూడా అనే పరిశ్రమలో పనిచేస్తున్నానని చెప్పి సరోజ్ లారీ ఎక్కాడు. భార్య కుమూరుడు కింద ఉన్నారు. ఇంతలో చిన్నారి తల్లి నుండి తప్పించుకుని లారీ కిందకి వెళ్లాడు ఇది ఎవరూ గమనించకపోవడంతో లారీ ఒకసారి బయలు దేరింది. దీంతో ఆ చిన్నారి లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు. కళ్ళముందే చిన్నారి మృతి చెందడంతో తల్లి దండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. చిల్లకూరు ఎస్ఐ సుదీర్ కుమార్ కేసు నమోదు చేసి మృతికి గల కారణాలు తెలుసుకుంటున్నారు.

## 14వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలి : కౌన్సిలర్

వెంకటగిరి, ఆగస్టు 12, ప్రభాతవార్త :14వ వార్డులో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవ తీసుకుని పరిష్కరించాలని కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. సుదర్శన్ నగర్ సచివాలయం నందు ప్రజా సమస్యలపైన గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. సచివాలయం నందు ప్రజల నుంచి వినతులను వార్డ్ కౌన్సిలర్ స్వీకరించారు. 14వ వవార్డులో ఉన్నటువంటి బొగ్గులు మిట్ట, ధర్మాపురం, నరసింహారావు వీధిలలో పారిశుద్యం సరిగాలేదని ప్రజలు తెలియజేశారు.

# ప్రజా సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 12 ప్రభాతవార్త : ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. మేయర్ డా. శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు శాలిని, ఉమా అజయ్‌లు కమిషనర్‌ను కలిసి తమ వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. ప్రజల నుండి వినతులను స్వీకరించిన కమిషనర్ ప్రజల నుండి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ప్రజల నుండి వినతులను స్వీకరించిన కమిషనర్ ప్రజల నుండి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 62 మంది వినతులు అందాయని అన్నారు. ఇందులో ముఖ్యంగా నగరంలోని రోడ్లలో ఉన్న గుంతలను పూడ్చాలని, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా జరిపించాలని డిప్యూటీ మేయర్ కోరారు. వర్షాలకు తమ వవార్డు జలమయం అవుతోందని పరిష్కరించాలని కార్పొరేటర్ ఉమా అజయ్ కోరారు. బైరాగిపట్టెడ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఒకసారి పరిశీలించి పరిష్కరించాలని కార్పొరేటర్ షాలిని కోరారు. నెట్టిపల్లి భూముల సమస్య పరిష్కరించాలని కోరగా పూర్తిగా అవగాహన చేసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తమ ఇండ్ల పైకి వచ్చి చెట్ల కొమ్మలు తొలగించాలని టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని కాలువలు శుభ్రం చేయించాలని ప్రజలు కోరారని తెలిపారు. వీటన్నింటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరన్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, రాజు, శ్రావణి, ఆర్‌ఓలు సేతు మాధవ్, కేఎల్ వర్మ, ఏసిపి బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టి బాబు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు అర్జీలు సమర్పిస్తున్న అర్జీదారులు

## మహిళ ఖాతానుంచి 69వేలు గల్లంతు..

పెద్దపంజాణి ఆగష్టు12 ప్రభాతవార్త : తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఒక మెసేజ్‌ను ఓ మహిళా క్లిక్ చేయడంతో ఆమె బ్యాంకు ఖాతానుండి నగదు మాయమైన సంఘటన మండలంలోని మద్దలకుంట గ్రామంలో వెలుగుచూసింది.ఈ సంఘటనకు సంబందించి బాధితురాలు లలితమ్మ పోలీసులకు ఫిర్యాదుచేసిన మేరకు వివరాలిలా..ఈ నెల9వతేది రాత్రి తొమ్మిదన్నరగంటలప్రాంతంలో తనసెల్‌ఫోన్‌కు ఒక మెసేజ్‌వచ్చిందని ఆమెసేజ్‌ను తాను ఓపెన్ చేయగానే తనయూనియన్‌బ్యాంకు ఖాతాలోఉన్న 50వేలు ఓసారి మరోసారి 19వేలరూపాయలు గల్లంతైనట్లు బాధితురాలు పేర్కొంది.తన ఖాతానుంచి గుర్తుతెలియని వ్యక్తులెవరో ఈ నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని పేర్కొంది.బ్యాంకు అధికారులను అడిగితే తాము ఏమీచేయలేమని పేర్కొన్నారని సంబందితఅధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని లలితమ్మ ఫిర్యాదులో పేర్కొంది.

## పట్టణంలో వ్యక్తి దారుణ హత్య!

పలమనేరు,ఆగస్టు 12,ప్రభాతవార్త: ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు..పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన మొగిలీశ్వర్(50) గత 5 సంవత్సరాలుగా తన భార్యను విడిచి మరో మహిళ అయిన మంగమ్మతో సహజీవనం సాగిస్తూన్న క్రమంలో గత 15 రోజులుగా తరచూ వారి ఇద్దరి మధ్య గొడవలు చోటుచేసుకునేదని, ఈ క్రమంలో ఆదివారం రాత్రి మొగిలీశ్వర్ మద్యం సేవించి ఇంటికి వచ్చి మంగమ్మపై దాడి చేయగా మంగమ్మ చాకుతో మొగిలీశ్వర్‌ను దాడి చేయడం జరిగిందని తెలిపారు.దీంతో దాడిలో మొగిలీశ్వర్ ఆధిక రక్తశ్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా ఉదయం స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యప్తు చేస్తున్నామని సిఐ చంద్రశేఖర్ తెలిపారు.

## వ్రందలాది బైకులతో త్రివర్ణప్రచారం



పుంగనూరు,ఆగస్టు 12 ప్రభాతవార్త : ఇంటింటిపై జెండా ఎగురవేయాలని కోరుతూ పట్టణానికి చెందిన అన్నిపార్టీల యువకులు, సంఘాలు,ఏకైమై ముక్తకంఠంతో నినదించాయి. సోమవారం ఉదయం నుంచి పట్టణంలోని పార్టీ ప్రమేయం లేకుండా అన్ని సంఘాలు 400పైగా బైకులతో ర్యాలీ నిర్వహించాయి. బైక్‌లలో తిరుగుతూ భారతస్వాతంత్ర్యసంబరాలకు మద్దతు పలకండి, మీఇంటిపై జెండా ఎగుర వేయండని కోరుతూ త్రివర్ణ ప్రచారం నిర్వహించారు. రాజంపేట జిల్లా బిజెపి ప్రతి ఇంటికి జెండా ఎగురవేసే కార్యక్రమ నిర్వాహకుడు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిఎస్ రాజారెడ్డి అధ్వర్యంలో జరిగిన ఈప్రతిష్టాత్మక బైక్‌ర్యాలీ పట్టణ చరిత్రలో రికార్డు సృష్టించింది. ఉదయం పట్టణంలోని నానాసాహెబ్‌పేట నుంచి మొదలైన ఈర్యాలీలో పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్, రోటరీక్లబ్, భజరంగ్‌దళ్, పురసం, దివ్యజ్ఞాన జ్యోతి, మానవతా, ఆర్యవైశ్య, క్షత్రీయ, రెడ్డిజన,బలిజ,భవన నిర్మాణ,వివేకానంద, హిందూ జాగరణ, ఆరెస్సెస్,కూటమి పార్టీల సభ్యుల,వైకాపా సభ్యులు, మాజీ సైనికులు, క్రీడాసంఘాలు, ప్రముఖులు, మేధావులు,పట్టణ ప్రజలు ఈఅతిపెద్ద బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నానాసాహెబఫేటనుంచి గోకుల్ సర్కిల్ చేరుకుని మానవహారం ఏర్పాడి దేశ నినాదాలు చేశారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నా మదన్‌మోహన్‌బాబు, బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకేష్‌తో పాటూ పలు పార్టీల నాయకులు, సంఘాల నార్వహకులు పాల్గొన్నారు.

## మూర్తి గురుకుల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన : మాజీ మంత్రి పెద్దిరెడ్డి



పుత్తూరురూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు చెన్నైసమీపంలోని ఆంబూరులో రైలు కింద పడి పుత్తూరుకు చెందిన పురోహిత్ మూర్తి గురుకుల్ 2024 మార్చి 24న మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూర్తి గురుకుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఏ సమయంలో ఏ సాయం కావాలన్నా చేస్తామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి వెంట పాండురంగయాదవ్ తదితరులు ఉన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం : కడ ప్రాజెక్ట్



కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజక వర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ఆయన నిర్వహి ంచగా 52మంది ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం పి.డి. మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో త్వరలోనే జిల్లా కలెక్టర్ సూచనలతో ప్రతి పదిహేను రోజులకు ఓ సారి మూడు గ్రామాల్లో పర్యటించి ఉదయం నుంచి సాయంత్రం దాకా ప్రజల సమక్షంలోనే ప్రజల వినతులు స్వీకరించడం, గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతినెలా ఆరు గ్రామాల్లో అధికార బృందంతో తానే స్వయంగా పర్యటిస్తానని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్, వెబ్‌సైట్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న అడిగి తెలుసుకుంటున్నారన్నారు. కడ పరిధిలో అభివృద్ధి పనులను ఆయాశాఖలకు ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేందుకే ప్రభుత్వం కడను ఏర్పాటుచేసిందని అధికారులను భయపెట్టేందుకు కాదని పేర్కొన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల దినం అని తెలిసినా కొంతమంది అధికారులు ఈ కార్యక్రమానికి ఆలస్యంగా రావడం పట్ల కడ పి.డి. ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని చురకలు అంటించారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి సినిమాల్లో చూపించే లాగా ఆ కార్యాలయం చుట్టూ తిరగాలి, అక్కడ తిరగాలి అనే ఆవేదన ప్రజల్లో రాకుండా వారి సమస్యల పరిష్కారంకు దారి చూపాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై శ్రీ ద్రౌపదీదేవి చిద్విలాసం



పుత్తూరురూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త: శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమ వారం రాత్రి స్వామి, అమ్మవార్లు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం కార్వేటినగరం రోడ్డులోని మంచినీళ్ళగుంట నుంచి ప్రత్యేక పుష్పాలతో గెరిగెను అలంకరించి పురవీధుల్లో ఊరేగిం చారు. ఈ గెరిగె మంచినీళ్ళగుంట నుంచి కాపు వీధి మీదుగా ఆలయానికి చేరుకుంది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల నడుమ పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం హిడింబాసర, బకాసుర వధ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మంగళవాయిద్యాలు నడుమ విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక పుష్పాలు అలంకరించి స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై ఊరేగించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ప్రతిరోజు స్వర్ణలత భాగవతారని హరికథ గానం నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు తెలుగు వీధి నాటకం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

న నేడు ఆలయంలో...

శ్రీ ద్రౌపదీదేవిసమేత ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పల్లకిసేవ మధ్యాహ్నం అన్నదానం, రాత్రి కల్యాణోత్సవం అనంతరం అశ్వ వాహనంపై స్వామి, అమ్మవార్లు ఊరేగింపు కార్యక్రమాలు. అలాగే ఏకాంత సేవ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు దేవస్థానం కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తెలిపారు.

## అట్టహాసంగా అమ్మవారి గెరిగె ఊరేగింపు

### శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతరకు అంకురార్పణ



రేణిగుంట, ఆగస్టు 12 ప్రభాతవార్త: రేణిగుంటలో కొలువుదీరిన మహిమాన్వితురాలు శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతర అంకురార్పణలో భాగంగా అమ్మవారి గెరిగె జాతర కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, వీఆర్ రావణన్ పర్యవేక్షణలో రేణిగుంటలో ఊరేగించారు. గెరిగె ఊరేగింపుతో శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతర ప్రక్రియ ప్రారంభమైంది. రేణిగుంట పట్టణమంతా గెరిగెను ఊరేగించారు. పలువురు భక్తులు గెరిగెకు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ నిర్వాహకులు సోలా మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఇప్పటికే రేణిగుంట ప్రధాన కూడలిలో పెద్ద పెద్ద విద్యుత్ ఆర్చిలను ఏర్పాటు చేశారు. రకరకాల దేవతామూర్తులు విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఊరంతా విద్యుత్ దీప తోరణాలు అందరిని ఆకర్షిస్తున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా నిర్వాహకులు బారికెడ్లు ఏర్పాటుచేశారు. రేణిగుంట పట్టణంలో జాతర సందడి నెలకొంది. జాతరలో భాగంగా అనేక రకాల దుకాణాలు నిలుస్తున్నాయి. శాంతి భద్రతల దృష్ట్యా రేణిగుంట డీఎస్పీ వెంకటాద్రి పర్యవేక్షణలో అర్బన్ సీఐ శరత్ చంద్ర ఆధ్వర్యాన అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ముందస్తు భద్రత చర్యలో భాగంగా అదనపు పోలీసు బలగాలను మోహరింపచేస్తున్నారు. జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని జాతర నిర్వాహకులు, కమిటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, సభ్యులు జ్యోతినారయాణ, సదాశివరెడ్డి, వీఆర్ రావణన్ తదిరతులు కోరారు.

## శ్రీ వకుళమాతను దర్శించుకున్న రాష్ట్రమంత్రులు



తిరుపతిరూరల్, ఆగష్టు12 ప్రభాతవార్త: రాష్ట్రంపై వకుళమాత అమ్మవారి ఆశీస్సులు, శ్రీవారి కృప ఎల్లవేళల ఉండాలని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ఆకాంక్షించారు. సోమవారం తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాతను రాష్ట్ర మంత్రులు దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 15న రెవెన్యూ సదస్సు ఫార్మల్ లాంచింగ్, 16 నుండి సెప్టెంబర్ 30వరకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని తెలిపారు. రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా ప్రజల ముంగిటకు గ్రామాలకు అధికారులు వెళ్లి పర్కిరించే విధంగా ఆగష్టు 15న ఫార్మల్ లాంచింగ్ చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనేత శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి 9గంటల వరకే...ఘాట్‌లో ద్విచక్రవాహనాలు

తిరుమల,ఆగస్ట్ 12ప్రభాతవార్తప్రతినిధి: శేషాచలంఅటవీప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో రాత్రి 9గంటల వరకే ద్విచక్రవాహనాలు అనుమతి ఉంటుంది. ఉదయం 6గంటల నుండి రాత్రి 9గంటల వరకు మాత్రమే తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో, తిరుపతికి దిగే మొదటి ఘాట్‌లో ద్విచక్రవాహనాల ప్రయాణానికి టిటిడి అధికారులు ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు రానున్న సెప్టెంబర్ 30వతేదీ వరకు అమలులో ఉంటాయి.

## వైభవంగా పాలేటమ్మ జాతర



సోమల, ఆగస్టు 12 ప్రభాతవార్త : నెల్లిమంద సమీపంలో వెలసిన పాలేటి గంగమ్మ జాతరను ఆది, సోమవారాల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సిద్ధపూజతో జాతర ప్రారంభమైంది. అనంతరం సాంప్రదాయబద్ధంగా అమ్మవారి పుట్టినిల్లుగా భావించే పాయల వంశస్థులు అమ్మవారికి బోనాలు సమర్పించడంతో వివిధ గ్రామాల ప్రజలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ బోనాలు సమర్పించుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన చాందిని బండ్లు అమ్మవారి చుట్టూ ప్రదర్శనలు చేయడంతో జాతర తారా స్థాయికి చేరుకుంది. ఉదయం నుంచి అమ్మవారికి పొంగల్ సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం దోపు తిరుణాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సాకిబండ నరసింహులు ఆధ్వర్యంలో అమ్మవారి జలాధివాసంతో జాతర పూర్తయింది. ఎస్ఐ శివశంకర్ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

## పోలీసు కుటుంబాలకు ఆర్థిక చేయూత



తిరుపతిటౌన్, ఆగస్ట్ 12ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో వివిధ చోట్ల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలకు సోమవారం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆర్థిక చేయూతనందించారు. ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన ట్రాఫిక్ ఎస్ఐ రెడ్డినాయక్ సతీమణి సరోజకు 1.50లక్షలు రూపాయలు, ఏఆర్‌కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తల్లి సుశీలమ్మకు 1.25లక్షలు రూపాయలు, హోంగార్డు మోహన్ భార్య కవితకు లక్షరూపాయలు చెక్కులను ఎస్పీ సుబ్బరాయుడు అందజేశారు. పోలీసుల కుటుంబాలకు అన్ని విధాలా ఆదుకుంటామని, ఏదేని సహాయం అవసరమైనా తనను కలవాలని కోరారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి

### ఏపీ ఎస్ఐఆర్‌డి పరిశీలకులు రాజ్యలక్ష్మి



గూడూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం పై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ ఎస్ఐఆర్‌డి పరిశీలకులు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం గూడూరు మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లకు రిఫ్రెషర్ ట్రైనింగ్ మూడు రోజులు పాటు నిర్వహించడం జరుగుతుంది. మొదటి రోజు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచులు, గ్రామ పంచాయితీల అభివృద్ధికి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయితీలో జరిగే అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలను పరి శుభ్రంగా ఉంచాలని, ప్రజలు, వారి ఇల్లు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పంచాయితీ సమావేశాలు, గ్రామ సభల నిర్వహణ, పంచాయితీ సమావేశాలలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పంచాయితీ సెక్రెటరీ పాల్గొని, పంచాయితీలో చేపట్టవల్సిన మౌలిక వసతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, నిధులు, నీటి సరఫరా, వీధి దీపాలు, పంచాయితీలకు వచ్చే ఆదాయం, ఖర్చులు తదితర విషయాలపై పూర్తిగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వెంకటేశ్వర రావు, డిఎల్‌పివో వెంకట రమణ, ఏవో మురళీకృష్ణ, ఎంపిపి గురవయ్య, గ్రామ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రానైట్ లారీలను... పోలీసులకు పట్టిచ్చిన గ్రామస్తులు



కుప్పంరూరల్, ఆగస్టు 12 ప్రభాతవార్త : అక్రమంగా గ్రానైట్ సంపదను లారీల్లో తరలిస్తుండగా గ్రామస్తులు, రైతులు ఏకమై గ్రానైట్ లారీలను పోలీసులకు పట్టిఇచ్చిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని గుడ్ల నాయనపల్లి, ఊరినాయని కొత్తూరు గ్రామాలకు వెళ్లే దారిలో తరచూ గ్రానైట్ అక్రమ రవాణా జరిగేదని స్థానికులు తెలిపారు.గ్రానైట్ రవాణాకు సంబంధించి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంగా తాము ప్రశ్నిస్తే తమను గ్రానైట్ మాఫియా వారు బెదిరించారని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు, రైతులు ఏకమై సోమవారం దారిలో కాపుకాశారు. ఎపి02డబ్ల్యు5145అనే నెంబరుగల లారీతో పాటు మరో లారీలో భారీ గ్రానైట్ దిమ్మెలు తరలిస్తుండగా మార్గమధ్యంలో గ్రామస్తులు, రైతులు అడ్డుకున్నారు. ఇది గమనించిన లారీ డ్రైవర్ పరారయ్యాడు. గ్రామస్తులు కుప్పం పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలికి చేరుకుని విచారించారు.

## ఈస్ట్ డిఎస్పీని కలిసిన జనసేన నాయకులు



తిరుపతి హెల్త్, ఆగస్టు 12 ప్రభాతవార్త : తిరుపతి ఈస్ట్ డిఎస్పి వెంకట్ నారాయణని జనసేన నేత నెలవాయి మురళీకృష్ణ ఆధ్వర్య ంలో జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసాయి. ఈ సందర్భంగా ఈస్ట్ డిఎస్పి వెంకట్ నారాయణని దుశా లువతో పూల బొకేతో సన్మానించి పవన్ కళ్యాన్ ఫోటోను అందజేసారు.

## వైద్య విద్యార్థుల క్యాండిల్ ర్యాలీ




తిరుపతి హెల్త్, ఆగస్టు 12, ప్రభాతవార్త : కోల్‌కత్తాలోని ఆర్‌జికర్ మెడికల్ కాలేజీలో జరిగిన హేయమైన, దౌర్జన్యకరమైన సంఘటనకు సంఘీభావంగా, ఆర్‌జిలోని ఛాతి వైద్య విభాగంలో రెండవ సంవత్సరం పోస్ట్‌గ్రాడ్యుయేట్ నివాసి యొక్క విషాద మరణం పట్ల మా ప్రగాఢ సంతాపం, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌వి వైద్య కళాశాల, స్విమ్స్ వైద్యులు పిజీ, యూజీ వైద్య విద్యార్థులు రూయా ఆసుపత్రి ప్రాంగణం నుండి రామకృష్ణ డీలక్స్ సర్కిల్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.
















